

www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

ఎస్వీ అగ్రికల్చర్ కళాశాలకు బాంబు బెదిరింపు

తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు బాంబులు పెట్టామని కళాశాల మెయిల్ కి బాంబు బెదిరింపు వచ్చింది. హ్యూమన్ ఐఈడి బాంబు పేరుతో పేల్చేస్తా మంటూ గురువారం ఉదయం కళాశాల మెయిల్ రావడంతో కళాశాల ఇన్చార్జ్ అసోసియేట్ డీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తత అయిన ఎస్ వి అగ్రికల్చర్ కళాశాల సిబ్బంది, కళాశాల అధికారులు తిరుపతి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు అగ్రికల్చర్ కళాశాలకు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తో చేరుకుని తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రం నుండి మెయిల్ వచ్చి నట్టు కళాశాల సిబ్బంది వెల్లడించారు. గత రెండు నెలల క్రితం కూడా తమిళనాడు నుండి మెయిల్ కూడా ఒకసారి వచ్చింది. దీనిపై తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు ఆధ్వర్యంలో తనిఖీలు కళాశాలలోని పలు ప్రాంగణాలలో చేశారు. సిఐ మాట్లాడుతూ ఇలాంటి ఫేక్ న్యూస్ లు, ఫేక్ ఈ మెయిల్ అప్పుడప్పుడు వస్తుంటాయని అయినా పోలీసుల ఆధ్వర్యంలో అప్రమత్తంగా ఉంటామని అన్నారు.

స్టైఫండ్‌ను పెంచండి..

కొనసాగుతున్న ఎస్‌వి వెటర్నరీ విశ్వవిద్యాలయ విద్యార్థుల సమ్మె

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు, తమ స్టైఫండ్‌ను ఇతర వైద్య విద్యా కోర్సుల స్థాయికి పెంచాలని డిమాండ్ చేస్తూ నాలుగవ రోజు నిరవధిక సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ప్రస్తుతం అండర్ గ్రాడ్యుయేట్ (యుజి) విద్యార్థులు రూ.7వేలు, పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) విద్యార్థులు రూ.9 వేలు, పీహెచ్‌డీ విద్యార్థులు రూ.10 వేలు మాత్రమే పొందుతున్నారని, అదే సమయంలో, సమాన వ్యవధి గల ఇతర వైద్య విద్యా కోర్సుల విద్యార్థులు రూ.20 వేలకు పైగా స్టైఫండ్ పొందుతున్నారని, గత 13 ఏళ్లుగా ఈ సమస్యపై పోరాటం సాగిస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు ఎటువంటి స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడి వెటర్నరీ కళాశాలలకు చెందిన విద్యార్థులు, ప్రభుత్వం అధికారిక ఉత్తర్వు విడుదల చేసే వరకు సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. నాల్గవ రోజూ విద్యార్థులు బాలాజీ కాలనీ సర్కిల్ వద్ద ఉదయం 9.30 గంటలకు విశ్వవిద్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమై, బాలాజీ కాలనీ సర్కిల్ వద్దకు చేరుకుని 'మానవహారం' ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా, తక్కువ స్టైఫండ్ కారణంగా ఇంటర్న్‌షిప్ సమయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వారు మాట్లాడుతూ విద్యార్థులకు 4 నుంచి 5 నెలలకో సారి మాత్రమే స్టైఫండ్ అందుతోందని, అది కూడా తక్కువ మొత్తమే అన్నారు. ఈ అంశాలను విద్యార్థులు మీడియా ద్వారా తెలిపి, ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు ఈ స్టైఫండ్ పెంపు కోసం సమ్మె చేయడం ఇది మొదటి సారి కాదన్నారు. 2022 లో కూడా ఇదే సమస్యపై సమ్మె చేశామని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని విద్యార్థులు గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరిస్తుందనే విశ్వాసం వుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం 300 మంది మాత్రమే ఇంటర్న్‌షిప్‌కు వెళతారని, స్టైఫండ్‌ను రూ.24 వేలుకు పెంచినా అదనం గా రూ.5 కోట్లకు మించి వ్యయం ఉండదని విద్యార్థులు వివరించారు. అదే సమయం లో ప్రభుత్వానికి పశు సంవర్ధక రంగం ద్వారా సంవత్సరానికి రూ.60 వేల కోట్లకు పైగా జిడిపి ఆదాయం వస్తోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి, ఇతర వైద్య విద్యా కోర్సులకు సమానంగా వెటర్నరీ విద్యార్థులకూ స్టైఫండ్ పెంచాలని విద్యార్థులు డిమాండు చేశారు. లేకపోతే, ప్రభుత్వం అధికారిక ఉత్తర్వు విడుదల చేసే వరకు ఈ నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు.

మానవ హారం నిర్వహించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌వి వెటర్నరీ విద్యార్థులు

ధరలేదు.. దిగుబడి రాదు..!

- అన్నదాతపై ప్రకృతి, ప్రభుత్వం కన్నెర్ర
- ఎకరాకు పెట్టుబడి రూ.30 వేలు
- దిగుబడి 20 బస్తాలు రాబడి సున్నా.. అప్పులే మిన్న
- రైతుల్లో దింపుడు కల్లం ఆశలు

కష్టే ఫలి అంటారు పెద్దలు..ఆ కష్టానికి తగ్గ ఫలితం రాకుంటే ఆ బాధ వర్ణనాతీతం..యుద్ధ భూమిలో శరీర భాగాలు ఛిద్రమవుతున్నా సైనికుడు విప్లవ స్ఫూర్తితో ముందుకు వెళ్లినట్లు వ్యవసాయ క్షేత్రంలో రైతులు నష్టాలు..కష్టాలు..అప్పులే ఎదురవుతున్నా దేశానికి పట్టెడన్నం పెట్టేందుకు రైతన్న విశ్రమించకుండా ఆరుగాలం శ్రమిస్తున్నాడు. అయితే దేశానికి రక్షణ కల్పిస్తున్న సైనికుడికిచ్చే గౌరవం అదే దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతకు మాత్రం దక్కడం లేదు. ఓ వైపు ప్రకృతి.. ఇంకో వైపు పాలక ప్రభుత్వాలు అన్నదాతపై కన్నెర్ర చేస్తుండడంతో ఏ యేటికాయేడు అన్నదాతలకు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ ఏడాది పరిమితికి మించి వర్షాలు కురవడంతో రైతన్న ఆశలకు అవధులు లేకుండా పోయింది. ఈ రబీలో వరిని వడివడిగా పండించి సిరుల ధాన్యాలను కళ్లారా చూద్దామనుకున్న అన్నదాత ఆశలపై ప్రకృతి నీళ్లు చల్లింది. అనుకోని వర్షాలు, మంచు, తేమ కారణంగా తూర్పు మండలాల్లో ధాన్యం దిగుబడి తగ్గింది. వచ్చిన దిగుబడికి రాబడేమైనా వస్తుందా? అనుకుంటే అదీ లేదు. అరకొర దిగుబడిని అత్తెసరు ధరకు అమ్ముకుంటూ రైతు అప్పుల పాలవుతున్నాడు. ప్రభుత్వమేమైనా ఆదుకుంటుందా? అంటే అది 'దింపుడు కల్లం ఆశే' అవుతోంది.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:

దిగుబడి 20 బస్తాలే!

గత ఏడాది నవంబరు నుండి ఈ ఏడాది జనవరి వరకు కురిసిన భారీ వర్షాలకు తూర్పు మండలాల రైతుల్లో రబీ అశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో 17వేల హెక్టార్లకు పైగా వరిని సాగు చేశారు. అయితే నవంబరులో నాటిన వరికి అనుకోని వర్షాలు, మంచు, తేమ అవరోధాలుగా మారడంతో ధాన్యం దిగుబడి, నాణ్యత తగ్గింది. ఎకరాకు 20 బస్తాలు దిగుబడి వచ్చిందంటే చాలు గొప్పేనన్న స్థాయికి దిగుబడి దిగజారింది. ఎకరా పెట్టుబడికి సుమారు రూ. 30 వేలు దాకా పెట్టుబడి ఖర్చు చేసిన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ధరల రీత్యా పెట్టుబడైనా వస్తుందా? అన్న అనుమానాలు రైతుల్లో వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం ప్రైవేటు మిల్లర్లు, దళారులు 75 కిలోల మేలు రకం ధాన్యం బస్తాకిస్తున్న ధర కేవలం రూ.1500 నుంచి రూ. 1600 మాత్రమే. ఈ నేపథ్యంలో రైతుకు మద్దతు ధర లభించి లాభాన్ని వెనకేసుకుంటాడా..? అనేది అనుమానం అనే చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.

లభించని ప్రభుత్వ 'మద్దతు'

తూర్పు మండలాల్లో సంక్రాంతి అనంతరం వర్షాలు తగ్గు ముఖం పట్టడంతో నవంబరులో వరి వేసిన రైతులు కోతలకు ఉపక్రమిస్తున్నారు. దాదాపు 17వేల హెక్టార్ల సాగులో 10 శాతం పైగా కోతలు పూర్తయ్యాయి. ఈ క్రమంలో రైతులకు మద్దతు ధర ప్రకటించడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కోతలు ప్రారంభమై పది రోజులు దాటుతున్నా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం విచారకరం. ధాన్యం కొనుగోళ్లను ఎలా చేయాలన్న ప్రాథమిక శిక్షణా తరగతుల దశలోనే కార్యక్రమం వుంది. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఆన్‌లైను వెబ్ సైట్ రైతు సేవా కేంద్రాల్లో ఓపెన్ కాలేదు. ఫలితంగా కళ్లేల వద్దే రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. గత ఏడాది మేలు రకం ధాన్యం క్వింటాకు ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర రూ.2,233. ఏడాది దాన్ని రూ. 2,350 కు పెంచింది. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాక పోవడంతో రైతులు మరో దారి లేక దళారులు నిర్వహించిన ధరకే అమ్మేసుకుంటున్నారు. దీంతో అన్నదాత రాబడి సున్నాగా మారి అప్పుల కుప్పలో కూరుకుపోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం వెను వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి అన్నదాతకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

అనుకోని వర్షాలు, మంచు, తేమ కారణంగా తూర్పు మండలాల్లో ధాన్యం దిగుబడులు తగ్గిన మాట వాస్తవమే. ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు ముందుకొస్తే కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. సహకార సంఘాలు, రైతు సేవ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈక్రాప్, ఈకేవైసీ నమోదు చేసుకుని ఉంటేనే ప్రభుత్వం నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అర్హులవుతారు.

- రమేష్ బాబు,
ఏడీఏ, శ్రీకాళహస్తి.

ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలి: కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో సొంత స్థలం కలిగి ఉండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సొంతంగా ఇల్లు నిర్మించుకునేందుకు తిరుపతి నగరంలో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని తిరుపతి నగరపాలక కమిషనర్ ఎన్ మౌర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరంలో సొంత స్థలం కలిగి ఉండి పిఎంఎవై 2.0 పథకం కింద ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా 2 లక్షల 50 వేల ప్రభుత్వ సబ్సిడీ ద్వారా సొంతంగా ఇల్లు నిర్మించుకోవడానికి ఆసక్తి ఉన్న లబ్ధిదారులు సమీపంలో ఉన్న సంబంధిత వార్డు సచివాలయంలో అమెనిటి సెక్రెటరీని కలిసి, లబ్ధిదారుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, పాన్ కార్డు, కులం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్, ల్యాండ్ డాక్యుమెంట్స్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ తదితర పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఏర్పాటు చేసిన బోనుకు చిక్కకుండా తప్పించుకుంటున్న చిరుత

చిరుత తెలివి!

బోను వున్నా చిక్కని వైనం

ప్రజాశక్తి - క్యాంపస్ :

ఎస్వీ యూనివర్సిటీలో చిరుత కోసం ఉంచిన బోనులకు చిరుత చిక్కడం లేదు. అడవి లేదా కొండ ప్రాంతాలలో ఆహారం అందుబాటులో ఉండదు.. దీ కారణంగానే బోనులల్లో ఉంచిన ఆహారం కోసం వచ్చి చిరుత ఇరుక్కుంటుంది. అయితే యూనివర్సిటీలలో విరివిగా ఆహారం దొరకడంతో ముఖ్యంగా కుక్కలు అందుబాటులో ఉండడంతో బోను వద్దకు వచ్చి వెళ్లిపోతోందని ఫారెస్ట్ అధికారులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న చిరుత స్విమ్స్, భారతీయ విద్యా భవన్, వేదిక యూనివర్సిటీ, ఎస్వి యూనివర్సిటీ పరిధిలోని సంచరిస్తున్నట్లు పాదముద్రల ద్వారా తెలుస్తోంది. ఈ కారణంగా ఈ ప్రాంతంలో సంచరించే విద్యార్థినీ విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకులు, ఈ సంస్థలకు వచ్చే ఇతరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు అంటున్నారు.

ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నగరంలో ప్రజా అవసరాల దృష్ట్యా ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య తెలిపారు. నగరంలో ప్రజల కోసం మరిన్ని ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులతో కలసి రైల్వే స్టేషన్, జగజ్జీవన్ రామ్ పార్కు ప్రాంతాల్లో కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారన్నారు. ఈ మేరకు ప్రజలు రద్దీ ఎక్కువగా ఉన్న రైల్వే స్టేషన్‌తో మరి కొన్ని ప్రాంతాల్లో ప్రజా మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ మేరకు స్థల పరిశీలన చేశామని అన్నారు. వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డిఈ రమణ, సర్వేయర్ కోటేశ్వర రావు, ఉన్నారు.

పి4 పాలసీతో జీరో పావర్టీ

- గడువు లోపు ప్రణాళికలు రూపొందించాలి
- కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిఎస్ విజయానంద్ ఆదేశం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: పి 4 పాలసీ అమలుతో నియోజక వర్గ యాక్షన్ ప్లాన్ తయారీ జీరో పావర్టీ దిశగా పక్కాగా ప్రజా ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో ఆచరణాత్మక ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షిస్తూ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం సిఎస్ విజయవాడ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జీరో పావర్టీ దిశగా పి 4 (పబ్లిక్, పీపుల్, ప్రైవేట్ పార్టనర్ షిప్) పాలసీ, నియోజక వర్గ ప్రణాళిక తయారీపై, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ కోసం స్థల గుర్తింపు, ఎంఎస్ఎంఈ సర్వే అంశాలపై సంబంధిత కార్యదర్శులు వివరించగా తిరుపతి కలెక్టరేట్ నుండి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్, సంబంధిత సెక్రటరీ వివరిస్తూ వికసిత భారత్ లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ 2047 మేరకు పది సూత్రాల అమలుతో రాష్ట్రం, జిల్లా 15 శాతం పైగా వృద్ధి రేటు సాధించడం లక్ష్యంగా జీరో పావర్టీ దిశగా పక్కాగా ప్రణాళికలు తయారీ, అమలుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

6 టన్నుల ఎర్రచందనం పట్టివేత

- విలువ రూ. 4.20 కోట్లు
- ఎనిమిది మంది అంతర్ రాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు
- వాహనాల స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అడవుల నుండి అక్రమంగా ఎర్రచందనం తరలించకపోతున్న స్మగ్లర్ల భరతం పట్టడానికి టాస్క్ ఫోర్స్ ప్రత్యేక వ్యూహాలను అనుసరిస్తోంది. శేషాచలం అడవుల్లోకి వెళ్లే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద ప్రత్యేక నిఘాలో భాగంగా ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం కొమిటోని చెరువు వద్ద ఆకస్మిక తనిఖీలో భారీ మొత్తంలో ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నామని టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం తెల్లవారు జామున అటవీ సిబ్బందితో కలసి అన్నమయ్య జిల్లా, వీరబల్లి మండలం, అన్నమయ్య డివిజన్, సానిపాయలో కొమిటోని చెరువు సమీపంలో ఒక కారు, ఒక మోటారు సైకిల్ పార్క్ చేసి కొంత మంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారన్నారు. వారిని సమీపించడంతో టాస్క్ ఫోర్స్ సిబ్బందిని చూసి పారి పోతుండగా వారిని వెంబడించి ఎనిమిది మంది స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని ఆ ప్రదేశంలో స్మగ్లర్లు వినియోగించిన వాహనాలను, 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించామన్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లను విచారించగా వారిచ్చిన సమాచారంతో కర్ణాటక హోస్పేట కటికినహళ్లి నీలగిరి తోట చేరుకొని అక్కడ దాచి ఉంచిన 185 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం 195 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. అక్రమ రవాణా వెనుక ఉన్న ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేయడానికి దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు అభినందించారు. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న అధికారులకు రివార్డులు అందించారు.

పోలీసుల అదుపులో ఎర్రచందనం దొంగలు

మినిమం టైంస్కేల్ సాధనకు

16న జిల్లా సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 2ను సవరించి అందరికీ ఎంటిఎస్ అమలు చెయ్యాలని కోరుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి అందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16వ తేదీ నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఎస్వి యూనివర్సిటీ పరిపాలనా భవనం ఎదుట గురువారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చినబాబు, జేఏసీ ఛైర్మన్ గండికోట నాగవెంకటేష్ మాట్లాడుతూ ఈ జిల్లా సదస్సుకు ముఖ్య అతిథులుగా శాసన మండలి సభ్యులు ఐ వెంకటేశ్వరరావు, జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ కె ధనలక్ష్మి, సిఐటియు ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షుడు జి చిన్నబాబు హాజరవుతున్నారన్నారు. రాష్ట్రంలో 3 లక్షల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నష్టదాయకమైన జీవో నెంబర్ 2ను సవరించి, రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలు, యూనివర్సిటీలు, కేంద్ర రాష్ట్ర భాగస్వామ్యంతో నడుస్తున్న పథకాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందరికీ మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని కోరుతున్నామన్నారు. సమాన వేతనం కల్పించడం ద్వారా ఉద్యోగుల జీవితాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వర్క్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సి రాజేంద్ర, కార్యదర్శి యం మురగయ్య, కోశాధికారి సి గణేష్, మహిళా ఉద్యోగులు టి కళావతి, కె సెల్వి, వి సుజాత, వికె ధోరణి, టి సుమతి, పి పరిమళ, యం మీనా పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, తదితరులు

ముగ్గురు కార్యదర్శుల సస్పెన్షన్

నిధుల దుర్వినియోగమే కారణం

ప్రజాశక్తి -వరదయ్య పాలెం: మండలంలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన ముగ్గురు పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేస్తూ డీపీవో సుశీలా దేవి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిరానగర్ పంచాయతీకి సంబంధించి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తగిన ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు సిటిజన్ ఫర్ సివిల్ రైట్స్ ప్రతినిధి ఆశా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన డీపీవో పంచాయతీ నిధులు గల్లంతయినట్లు నిర్ధారణ కావడంతో సర్పంచ్ వీరభద్రం చెక్ పవర్ రద్దు చేశారు. 14వ,15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 లక్షలు దుర్వినియోగం చేసిన చిట్టిబాబు, నరేశ్, తిరుమల పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. సిటిజన్ ఫర్ సివిల్ రైట్స్ ప్రతినిధి ఆశ మాట్లాడుతూ ఇలాగే ఇతర పంచాయతీలో జరిగిన అవినీతి కుంభకోణాలను సైతం త్వరలో అధికారుల దృష్టికి తీసుకొచ్చి న్యాయం జరిగే వరకు తాను పోరాడుతానని పేర్కొన్నారు.

అండర్ పాస్ నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్: ఎంపీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి పార్లమెంట్ పరిధిలోని గూడూరు పట్టణానికి ప్రధాన మార్గమైన చిల్లకూరు కూడలి వద్ద చెన్నై-కలకత్తా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా వుందని, ప్రమాదాల నివారణకు అక్కడ వాహన చోదకులు, పాదచారులకు అనుకూలంగా ఉండే విధంగా వెహికల్ అండర్ పాస్ నిర్మాణం చేయాలని గతంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర మంత్రికి విన్నవించారు. ఆ సమయంలో చిల్లకూరు కూడలిలో ట్రాఫిక్ కి సంబంధించిన వీడియోలు, ఫొటోలను చూపించి సమస్య తీవ్రతను ఆయనకు వివరించినట్లు ఎంపీ తెలిపారు. ఇదిలా ఉండగా ఎంపీ గురుమూర్తి నేడు ఈ సమస్యపై పార్లమెంటులో ప్రశ్నించగా ఇందుకు సమాధానంగా కేంద్ర రోడ్లు, రవాణా శాఖా మంత్రి గడ్కరీ సమాధానమిస్తూ రూ. 45.82 కోట్లతో వెహికల్ అండర్ పాస్ నిర్మాణం మంజూరు అయిందని, ఇది ప్రస్తుతం టెండర్ దశలో వుందని తెలిపారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి సహకరించిన కేంద్ర మంత్రి గడ్కరీ కి ధన్యవాదాలు తెలిపారు.

దళిత మాజీ సర్పంచ్‌పై

దాడికి పాల్పడ్డ వారిని అరెస్టు చేయాలి

సిపిఎం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి -కెవిబి పురం: కెవిబిపురం మండలంలో మఠం గ్రామంలో నివసిస్తున్న మాజీ సర్పంచ్ వెంకటయ్య పై దాడి చేసిన పెత్తం దారులను వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద వద్ద దళితుల, బాధితులతో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులపై చిన్న చూపు చూస్తూ దళితులకు భూమి ఉండకూడదనే అహంకారపూరితంగా వ్యవహరిస్తున్న పెత్తందారులు తరచూ ఇలా దాడులకు పాల్పడుతూ దళితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు హత్యా యత్నం కేసు కూడా నమోదు చేయాలని వారు కోరారు. తక్షణమే బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య కుటుంబ సభ్యులు, దళితులు, మట్టం గ్రామ పంచాయతీ సర్పంచ్, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం, కెవిపిఎస్ నాయకులు

ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం కాదు

- బడ్జెట్‌లో పోలవరం ఎత్తు కుదింపుపై ఎంపీలు నిరసన తెలపాలి
- రాష్టానికి కేంద్ర నిధులపై నిర్దిష్ట ప్రకటన చేయాలి
- రైల్వే బడ్జెట్లో అధిక భాగం గుజరాత్ కిచ్చారు
- మీడియా సమావేశంలో జెడి లక్ష్మీనారాయణ, తలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విభజిత ఆంధ్రప్రదేశ్‌కి విభజన చట్టంలో పేర్కొన్నట్లు రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తగిన సహాయ సహ కారాలు, నిధుల మంజూరు చేయాల్సి ఉన్నా అధికారం కోసం రాజకీయ పార్టీలు రాష్ట్రావృద్ధిని విస్మరించి కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మల్లా మారిపోతున్నాయని, ఆంధ్రప్రదేశ్‌కు నయవంచన చేస్తున్నారని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తలసాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జెడి లక్ష్మీనారాయణ అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రచారం లో ఉన్నట్లు 14వ ఆర్థిక సంఘం ఎక్కడ ప్రత్యేక హోదా ఇవ్వకూడదని చెప్పలేదని, అది కేంద్ర ప్రభుత్వ పరిధిలో అంశమని, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా ఏపీకి ఇవ్వవచ్చన్నారు. నార్త్ ఈస్టర్న్ రాష్ట్రాలకు ఇప్పటికీ ప్రత్యేక హోదా కొనసాగుతోందన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వమే పూర్తి చేయాల్సి ఉన్నా, బడ్జెట్లో ఇరిగేషన్ కాంపోనెంట్ వరకు మాత్రమే భరిస్తామని, మిగిలిన నిర్మాణ పనుల ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని చెప్పడం దారుణం అన్నారు. పోలవరం నిర్మాణానికి నిర్దేశించిన ఎత్తు 45.72గా ఉండగా 41.15గా నిర్ణయించడం, పోలవరం డ్యాం నిర్మాణం వల్ల నిర్దేశిత ప్రయోజనాలు ఏవి జరగలేదన్నారు. అనుకున్న లక్ష్యా ల మేరకు నిధుల కేటాయింపులు జరగకపోయినా, పోలవరం డ్యామ్ ఎత్తును కుదించి నిర్మాణం చేస్తే ప్రపంచంలోనే డిడ్లియస్ట్ స్టోరేజ్ డ్యామ్‌గా మిగిలి పోతుందన్నారు. రెండు రోజుల కు ముందు కేంద్ర ఆర్థిక మంత్రి ఏపీకి నిధులు కేటాయిస్తు న్నామని చెప్పార న్నారు. అయితే ప్రపంచ బ్యాంకు నుండి కేంద్ర ప్రభుత్వం హామీతో ఆంధ్రప్రదేశ్ కి అప్పుగా నిధులు ఇచ్చారే తప్ప, ఎక్కడా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదన్నారు. దీనికే కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి సహకరిస్తోందని గొప్పలు చెప్పుకోవడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం చేతిలో రాష్ట్ర ప్రయోజనాలు ఉన్న వారు మాత్రం తమ పార్టీ పాలిత రాష్ట్రాలకు వేలకోట్ల రూపాయలు బడ్జెట్లో కేటాయింపులు చేయించుకొని, తక్కువ కేటాయింపులు తెలుగు రాష్ట్రాలకు చేశారని మండి పడ్డారు. 'ఒక గుజరాత్‌లో రైల్వే స్టేషన్ ఏర్పాటుకు రెండువేల కోట్లకు పైగా కేటాయింపులు చేసుకోవడం రాజకీయ ప్రముఖులకు కనబడలేదా?' అని ప్రశ్నించారు. రాయలసీమ ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్ ఖండ్ తరహా ప్రాజెక్టులో నిధులు కేటాయింపులు చేశామని చెప్పడం దారుణం అన్నారు. ఈ ప్రాంతాల అభివృద్ధికి ఏ ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. దావోస్ వెళ్లిన సీఎం చంద్రబాబు అక్కడ మోడీ ఆధ్వర్యంలో భారతదేశం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని భజన చేశారని, దీంతో ఆ పెట్టుబడులు గుజరాత్‌కు తరలిపోయాయని దుయ్య బట్టారు. ఆంధ్రప్రదేశ్‌కి రాయితీలు వస్తే ఒకటిన్నర కోట్ల మంది యువకులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే అవకాశం ఉందని, అసంబద్ధపు ప్రకటనలతో యువత మోసం పోకూడదని, ఈ అంశాలపై తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు పార్లమెంటులో చట్ట సవరణలకు పట్టుబట్టాలని, విభజిత తెలుగు రాష్ట్రాలలో కృష్ణాజలాల పంపకంపై నిర్ణయం తీసుకునే అధికారమున్న కేంద్ర ప్రభుత్వం అటుగా ఆలోచించకపోగా తెలుగు రాష్ట్రాలవారే సామరస్య పరిష్కారం చేసుకోవాలని సూచించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. ఇకనైనా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చి భవిష్యత్ తరాల అభివృద్ధికి బాటలు వేయాల్సిన ఆవశ్యకత పాలకులపై వుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుబ్రహ్మణ్యం, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ

టీడీపీ పాలనలోనే మహిళల అభివృద్ధి

డ్వాక్రా మార్కెట్‌లో ఏర్పాటుచేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ప్రజాశక్తి - నాయుడుపేట: టిడిపి ప్రభుత్వం మహిళల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తుందని, వారి ఉన్నతికి ఎన్నో పథకాలు రూపొందించిందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. గురువారం నాయుడుపేటలోని గాంధీ పార్కులో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన మార్కెట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆమె మహిళల కోసం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మహిళలు స్వయం ఉపాధి, సాధికారతతో ముందుకు వెళ్లడం ఆనందదాయకమన్నారు. అనంతరం అమరా గార్డెన్లో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.కే.రఫీ, టిడిపి నాయకులు న్యాయవాది పసల గంగాప్రసాద్, గూడూరు సుధీర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎస్.కె పజిల్లుల్లా, అర్బన్ సీఐ బాబి, డ్వాక్రా మహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు ఇవ్వండి

ఎన్నికైన ఆటోస్టాండు యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - కోట : కోట మండలం, బస్ స్టాండ్ సెంటర్‌లో గురువారం18 మందితో నూతన ఆటో స్టాండ్ యూనియన్ ఏర్పాటు చేయడం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా పుట్టయ్య, గిరి, ఉపాధ్యక్షులుగా మల్లికార్జునలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆటో కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో కార్మికులపై పోలీసుల, ఆర్‌టిఓ అధికారుల వేధింపులు తగవన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమణయ్య, ఆటో కార్మిక కమిటీ సభ్యులు నాగరాజు, రమణయ్య, భాస్కర్, ఆనంద్, సుధాకర్, కోటయ్య, నారయ్య, వినోద్, అశోక్, శ్రీనివాసులు, రాజా, గోవిందు, నాగరాజు, చెన్నయ్య లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య అవసరాలకు ట్రాక్టర్ మంజూరు

ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఈవోపీఆర్డీ అధికారి దయాసాగర్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, శ్రీ బొమ్మరాజుపురం గ్రామ పంచాయతీలో చెత్త సేకరణ, పారిశుద్ధ్య అవసరాల నిమిత్తం ప్రభుత్వం కేటాయించిన ట్రాక్టర్‌ను ఈవోపీఆర్డీ అధికారి దయాసాగర్, సర్పంచ్ మణి రాజులు గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కృషితో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా ట్రాక్టర్ మంజూరు కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించండి

సూచనలిస్తున్న గూడూరు ఆర్టీవో కిషోర్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రహదారి భద్రత మీ జీవితానికి రక్ష అని గూడూరు ఆర్టీవో కిషోర్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా గూడూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గూడూరు ఆర్టీవో కిషోర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్ప కుండా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సునీల్, ప్రభాకర్, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షలు నిర్వహించండి

ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్య విభాగంలో డిగ్రీ, పిజి కోర్సులు 2021లో చేరిన విద్యార్థులకు తక్షణమే పరీక్షలు నిర్వహించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) జాతీయ కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. పరీక్ష తేదీలను ప్రకటించకపోతే ఎస్వీ యూనివర్సిటీ ఎడి బిల్డింగ్‌ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

విద్రోహశక్తులపై చర్యలు తీసుకోవాలి

రాగల ఆనంద గౌడ్

యూనివర్సిటీకి సంబంధం లేని వ్యక్తులు అధికారులపై తప్పుడు ఫిర్యాదులు చేస్తూ, దూరవిద్య పరీక్షలు జరగనివ్వకుండా అడ్డుపడుతున్నారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద గౌడ్ ఆరోపించారు. కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిందని ప్రచారాన్ని చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యస్వీయు అధికారులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పరీక్షలు నిర్వహించాలని విద్యార్థి సంఘాలు కోరినట్లు ఆయన తెలిపారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు అభినందన

అశ్వతి తిరునాళ్ గౌరీ లక్ష్మీ బాయ్‌ని అభినందిస్తున్న డాక్టర్ బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రముఖ రచయిత్రి, కేరళ ట్రావెన్ కోర్ రాజ కుటుంబ సభ్య రాలు అశ్వతి తిరు నాళ్ గౌరీ లక్ష్మీ బాయ్ ను ఏబిఆర్ ఎస్ఎం రాష్ట్ర టెక్నికల్ ఎడ్యు కేషన్ సెక్రటరీ, శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం మెకా నికల్ ఇంజనీ రింగ్ అధ్యాపకుడు డాక్టర్ బాలసు బ్రమణ్యం అభినందించారు. ఆమె ఇటీవల పద్మశ్రీ అవార్డును అందుకున్నారు.

మలుపులు.. ప్రమాదానికి పిలుపులు

సూచిక బోర్డులేని ప్రమాదకరమైన మలుపు

రహదారి గుంతల మయం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ : మండలంలో పలు ప్రాంతాలకు వెళ్లే రహదారి మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో మలుపులు ఉన్నట్లు సూచిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో మొత్తం 46 పంచాయతీలు ఉన్నాయి. శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మీదుగా శుక్ర బ్రహ్మశమం, పెద్ద మిట్ట కండ్రిగ, వేడం, రామాపురం పంచాయతీలకు వెళ్లే రహదారిలో అనేక మలుపులు ఉన్నాయి. ఈ రహదారిలో నిత్యం కార్లు, బైకులు, ఆటోల ద్వారా వందల మంది ప్రయాణిస్తుంటారు. వీరిలో సగం మంది బతుకు తెరువు నిమిత్తం శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చి ఏదో ఒక పని చేసుకుని సాయంత్రానికి తిరిగి తమ గ్రామాలకి వెళ్తుంటారు. ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి వచ్చిన భక్తులు వేడం పంచాయతీలో ఉన్న చాముండేశ్వరి ఆలయాన్ని, వేయి లింగాల కోనలో ఉన్న దేవాలయాలను దర్శిస్తుంటారు. ఇంత ప్రాధాన్యత ఉన్న ఈ రహదారి మలుపుల్లో ఎక్కడా సూచిక బోర్డులు కనబడకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు గుర్తించకపోవడం గమనార్హం. కొన్ని ప్రాంతాల్లో మలుపుల దగ్గర రోడ్డుకు ఇరువైపులా పిచ్చి చెట్లు పెరగడం వలన అవతల వైపు నుంచి ఏ వాహనం వస్తుందో అర్థం కాక వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిలో అక్కడక్కడ ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిని గుంతల మయమ య్యాయి. గుంతల్లో వాహనాలు పడిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం నుంచి రామాపురం పంచాయతీకి వెళ్లే రహదారిలో ఉన్న అన్ని మలుపుల దగ్గర సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే గుంతలమయమైన రోడ్లను సరిచేయాలని ఆ ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

> రామాపురం పంచాయతీకి వెళ్లే రహదారిలో మలుపుల దగ్గర అక్కడక్కడ సూచిక బోర్డులు ఏర్పాట్లులో లోపం ఉన్న సంగతి నా దృష్టికి రాలేదు. తొందర్లోనే సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం. రహదారిలో ఉన్న గుంతల సమస్యను కూడా పరిష్కరిస్తాం.
>
> ఆర్ అండ్ బి అధికారి
> ఏ.ఈ.ఈ దుర్గేష్ కుమార్

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. గురువారం తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన్ను కలసి నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, పరిష్కరించాల్సిన సమస్యలపై చర్చించారు. అదేవిధంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందచేశారు. అనంతరం తిరుపతి జిల్లా డిఆర్వో నరసింహని వారి కార్యాలయంలో కలసి నియోజకవర్గంలోని పలు రెవెన్యూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థులకు ఇన్ఫినిటీ బాసట

విద్యార్థులకు నీటి శుద్ధి యంత్రం అందిస్తున్న ఇన్ఫినిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం, పెద్ద కన్నలి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ముంబైకి చెందిన ఇన్ఫినిటీ ఫిన్ కార్ప్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ బాసటగా నిలిచింది. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం సీఎస్ఆర్ కార్యక్రమం ద్వారా రూ. 1.50 లక్షలు విలువచేసే కుర్చీలు, టేబుల్స్, బీరువాలు, ఆర్వో వాటర్ సిస్టం, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాలలో హౌసింగ్‌పై రుణాలిచ్చి తద్వారా పేద ప్రజల రుణ బాధలను ఇన్ఫినిటీ ఫిన్ కార్ప్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ తీరుస్తోందంటూ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ రవల్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, సంస్థ రీజనల్ సేల్స్ మేనేజర్ మోహన్, మురళి, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, బాలాజీ నగర్, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ మొదటి వార్షికోత్సవం కరస్పాండెంట్ యం.శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో తిరుపతి సత్యం ఐఐటి అకాడమీ చైర్మన్ జి.సత్యనారాయణ, బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత ఎం.రాధయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్స్ కెఆర్ రెడ్డి చంద్రమోహన్, రాఘవరెడ్డి, చంద్రశేఖర్, హరి, యాంతోని, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి -కోట : కోట మండల ప్రభుత్వాసుపత్రిని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను, రోగుల గదులను, వాష్ రూమ్‌లను పరిశీలించారు. ఆసుపత్రి సిబ్బందికి తగు సూచనలు చేశారు. డాక్టర్ల పనితీరు బాగుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డాక్టర్లు ప్రియా, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేటలో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చింత విజయ ప్రతాపరెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నాయుడుపేటలోని ప్రభుత్వ పాఠశాలలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, పట్టణంలోని మున్సిపాలిటీ వద్దనున్న జనరల్ పాఠశాల, పదూరు అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి భోజనం సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పిల్లలకు ఆయన వాట్సాప్ నెంబర్ అందుబాటులో ఉంచాలని విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలిగిన విద్యార్థులే నేరుగా ఆయనకు తెలిపే సౌకర్యం కల్పించాలని తెలియజేశారు. విద్యార్థులకు సరైన ఆహారం అందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల విషయంలో ఎలాంటి అశ్రద్ధ చూపిన ఎవర్ని ఉపేక్షించేది లేదని పాఠశాలల్లో ప్రతి ఒక్కరు బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు నాయుడుపేట ఎంఈఓ బి.మునిరత్నం, అంగన్వాడి సిడిపిఓ ఉమామహేశ్వరిలు ఉన్నారు.

గుడిమల్లం రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-ఏర్పేడు : మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గుడిమల్లం-పాపానాయుడుపేట ఆర్ అండ్ బీ రోడ్డుకు అధికారులు గురువారం మరమ్మతులు చేపట్టారు. గుడిమల్లం పరశురామేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి రోడ్డు మరమ్మతులకు ఆదేశించారు. ఈ మేరకు గుడిమల్లం ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ బత్తలగిరి, ఆర్ అండ్ బి ఈఈ రెడ్డప్ప, ఏఈ ప్రమీల, వర్క్ ఇన్స్పెక్టర్ మురుగప్ప నాయుడులు రోడ్డులో ఉన్న గుంతలు, గతుకులకు ప్యాచీలు వేయించారు.

మహిళా జూనియర్ కళాశాల 32వ వార్షికోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో 32వ కళాశాల వార్షికోత్సవం కళాశాల అధ్యక్షులు డాక్టర్ సి. భువనేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్ డా. నారాయణమ్మ, డా. సత్యనారాయణ, మనో విజ్ఞాన శాస్త్ర ప్రొఫెసర్ డా.ఉమారాణి, పత్తిపాటి వివేక్, హాస్టల్ వార్డెన్స్ డా. స్నేహలత, యామిని సుధా, డా. ధనమ్మ, విద్యార్థి సమాఖ్య సభ్యులు డా.జయమ్మ, మునేంద్ర, డా. రాజేంద్రప్రసాద్, డా. జానకిరామిరెడ్డి కళాశాల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలు రేపటి తరానికి దివిటీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ చిగురువాడలో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రథమ వార్షికోత్సవం గురువారం మహతి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, అడిషనల్ ఎస్పీ మనోహర్ చారి, డివైఈఓ భాలాజి, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, కమాండర్ విద్యాసంస్థల అధినేత వాసు, చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ పిల్లలు రేపటి తరానికి దివిటిలాగా వెలగాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృత కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాలడుగు విజయ, ప్రిన్సిపాల్స్ మిల్లీ, ప్రసాద్, ప్రణీత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్య ఘర్ యోజనను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజనతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ఈ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ తిరుపతి ఆపరేషన్ ఈఈ వి. చంద్రశేఖర రావు సూచించారు. స్థానిక ఈఈ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం నుంచి పి యం సూర్యగర్ యోజన రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో టౌన్ డివిజన్ ఏడి.లు ఆంజనేయులు, ముని ప్రసాద్, జయ ప్రకాష్, రమేష్, ఏ.ఈ.లు కేశవులు, శేఖర్ బాబు, సీనియర్ అసిస్టెంట్ అభినయ్ కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తు గడువు ఫిబ్రవరి12 వరకు పెంపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న ఋణాల దరఖాస్తుకు గడువును ప్రభుత్వం ఈ నెల 12 వ తేదీ వరకూ పెంచడం జరిగింది. ఈ విషయం జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యనిర్వహణాధికారి శ్రీదేవి ఒక ప్రకటనలో గురువారం సాయంత్రం వెల్లడించారు.

ఎన్ఏఆర్ఎల్ ఉద్యోగులకు పోటీలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఎన్ఏఆర్ఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్షోత్సవాలు ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అమిత్ కుమార్ పాత్రో ఇటీవల ప్రారంభించిన విషయం విదితమే. ఈనెల 15వ తేదీ వరకు జరిగే పక్షోత్సవాల్లో భాగంగా గురువారం ఆ సంస్థ ఉద్యోగులు, విద్యార్థులకు క్విజ్, వ్యాసచారచన పోటీలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు జ్యూట్ బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రవి ప్రసాద్, సహాయ సంచాలకులు శ్రీనివాస గుప్తా, మల్లికా మాధురి, జి. హరి వెంకట కుమార్, కెవి సిజి, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివరంజనికి డాక్టరేట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్సిటీ, బయోఇన్ఫర్మెటిక్స్ విభాగంలో పరిశోధనలు నిర్వహించిన విద్యార్థిని శివరంజనికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పి.హెచ్.డి) పట్టాను ప్రధానం చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ట్రాన్స్ క్రిప్టోమిక్ విధానం ద్వారా మానవ గర్భాశయ క్యాన్సర్కు వ్యతిరేకంగా సంభావ్య ఔషద లక్ష్యాలను, నిరోధక రూపకల్పనను గుర్తించడం అనే అంశముపై ఆమె పరిశోధనను నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థి పి.శివరంజనికి స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి.కుమార్, డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఆర్.ఎం.ఓ. డాక్టర్ కోటిరెడ్డి, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, అభినందనలు తెలియచేశారు.

విద్యార్థుల అభ్యసన స్థితిగతులపై ఆరా

ప్రజాశక్తి -కోట : కోట మండలం, శ్రీ లక్ష్మమ్మ గిరిజన కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి ధారా మస్తానయ్య గురువారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పాఠశాలలోని పలు రికార్డులను, మిడ్ డే మీల్స్ నిర్వహణపై ఆరా తీశారు. విద్యాభ్యాసంపై పిల్లలకు పలు మెలుకువలను తెలియజేశారు. ఎంఈఓతో పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు ఉన్నారు.

అంకురలో అరుదైన శస్త్ర చికిత్స

OPPO Reno11 5G
2025.02.06 13:03

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వంశీకృష్ణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి అంకుర చిల్డ్రన్స్ అండ్ ఉమెన్స్ హాస్పిటల్‌లో మెదడు వాపు వ్యాధితో బాధపడుతున్న బాలుడికి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. తిరుపతి పద్మావతిపురానికి చెందిన శబరిష్ (13)కు మెదడువాపు వ్యాధి ఉన్నట్లు తమ వైద్యులు నిర్ధారిం చారని తెలిపారు. వెంటిలేటర్ ద్వారా కూడా శ్వాస తీసుకునేందుకు బాలుడు ఇబ్బంది పడుతుండడంతో, అడ్వాన్స్ మిషన్స్‌తో కృత్రిమ శ్వాస అందించి, శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించ మన్నారు. తమవద్ద అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందని, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు పార్ధసారథి, దినేష్ రెడ్డి, రవిచంద్ర, రమణ, వీడి జగదీష్, బాలుడు తల్లిదండ్రులు, బాధితుడు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్టు

- రూ. 30 లక్షల విలువైన నగలు స్వాధీనం

స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : ఒంటరిగా ఉన్న మహిళలను బెదిరించి 30 లక్షల పైగా విలువైన నగలను చోరీ చేసిన ముగ్గురు అంతర్ రాష్ట్ర దొంగలను అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. 2024 డిసెంబర్ 20వ తేదీన కేశవాయన గుంట, 4వ క్రాస్‌లో నివాసముంటున్న ధనమ్మ వద్దకు ముగ్గురు వ్యక్తులు వెళ్ళి తాము మున్సిపల్ ఆఫీసు నుండి వచ్చినామని, ఇంటిలో ఉన్న వాటర్ కనెక్షన్‌లు, డ్రైనేజ్ పైపుల కొలతలు వేయాలని ఆమెను నమ్మించారు. ఆమె వారి మాటలు నమ్మి వారిని డ్రైనేజ్ పైపుల వద్దకు తీసుకోని వెళ్ళగా, వారిలో ఇకరు మాత్రం ఇంటిలోకి వెళ్ళి బంగారు నగలు, డబ్బులు దొంగిలించాడు. తరువాత అందరూ అక్కడి నుండి పారిపోయారు. ఆ తర్వాత తను మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు తిరుపతి క్రైమ్ పోలీసులు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసే దర్యాప్తు చేపట్టిన క్రైమ్ పోలీసులు, నిందితుల కోసరి గాలింపులు చేపట్టారన్నారు. గురువారం ఉదయం తిరుపతి- చెర్లోపల్లి బైపాస్ రోడ్డువద్ద అనుమాన స్పదంగా తిరుగుతున్న ముద్దాయిలు కృష్ణ (35), శరత్ (24), వేణుగోపాల్ (32)లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 30 లక్షలు విలువ చేసే బంగారు నగలు, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను రిమాండ్ కు తరలిస్తున్నట్టు వెల్లడించారు. ముద్దాయిల అరెస్టు సొత్తు స్వాధీనానికి సహకరించిన పోలీస్ అధికారులు సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి నాగభూషణరావు, డీఎస్పీ శ్యాం సుందరం, సిఐలు ప్రకాష్ కుమార్, చిన్న పెద్దయ్య, శివకుమార్ రెడ్డి, ఎస్సై ప్రదీప్ కుమార్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రమాదంలో మృతి చెందిన కరీమున్నిసా బేగం

ప్రజాశక్తి - రేణిగుంట: రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన గురు వారం మండల పరిధిలోని మర్రిగుంట సర్కిల్ వద్ద చోటు చేసుకుంది. రేణిగుంటకు చెందిన కరీమున్నిసా బేగం పాపనాయుడుపేట ప్రభుత్వ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. విధులకు వెళ్లే క్రమంలో మర్రిగుంట సర్కిల్ వద్ద తిరుపతి -మడిబాకకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సాయంతో ఆస్పత్రికి తరలించారు. ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లే లోపు ఆమె మరణించినట్టు వైద్యులు తెలిపారు.

చిట్టేడులో పూరి గుడిసె దగ్ధం

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది, బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న యాకసిరి చిన్నయ్య

ప్రజాశక్తి - కోట : కోట మండలం, చిట్టేడు గ్రామంలో గిరిజన కుటుంబానికి చెందిన కుడుముల చిన్న అంకయ్య పూరి గుడిసె ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో ఇంటిలోని వంట సామాగ్రి, టీవీ, నీటి మోటారు, తదితర సామాన్లు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న కోట మండల ఎస్సీ సెల్ నాయకులు యాకసిరి చిన్నయ్య వారికి 25 కేజీల బియ్యం, 2000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.

కొండ రాయుడు చెరువులో వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం మన్నసముద్రం సమీపంలోని కొండ రాయుడు చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. అతని వయసు 40 సంవత్సరాలు ఉండవచ్చుని, అతను సుమారు 20 రోజుల క్రితం బహిర్భూమికి వచ్చి గాని, లేక చేపలు పట్టడానికి వచ్చి గాని నీటిలో ప్రమాదవశాత్తు పడి చనిపోయినట్లు అనుమానిస్తున్నారు. నల్లని ప్యాంటు ధరించి ఉన్నాడని, ఎవరైనా గుర్తించిన యెడల ఏర్పేడు ఇన్స్పెక్టర్ జయచంద్రకు తెలపగలరు. శవ పరీక్ష నిమిత్తము శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి మార్చురికి మృత దేహాన్ని తరలించారు. మన్నసముద్రం విఆర్ఓ నాగమల్లి మణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర పరిస్థితులపై పవన్ కళ్యాణ్ స్పందించాలి

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): అధికారం చేపట్టడం కోసం హామీలను ఇచ్చి తుంగలో తొక్కారని, ప్రస్తుత పరిస్థితులను పరిశీలించి రాష్ట్ర ప్రజల అవస్థలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించాలని వైసీపీ తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్ విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన పవన్ స్వాముల వారు అంటూ తనదైన శైలిలో కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ విలేకరుల సమావేశంలో గోపాల్ రెడ్డి, ప్రేమ్ కుమార్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని నమ్మరు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రజలు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని నమ్మే ప్రసక్తే లేదని, ఆయన కార్యకర్తల సమావేశంలో ఊహాగానాల మాటలు మాట్లాడారని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ బాధ్యులు కిరణ్ రాయల్ వ్యాఖ్యానించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వాన్ని ఇంకో పదేళ్ళ ఎవరు ఏమీ చేయలేరని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు కూడా రావన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా ప్రవేశిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం, రామచంద్రపురం రెవెన్యూ సర్వే నెం.90/1లోకి ఎవరైనా అక్రమంగా ప్రవేశిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ మధుసూదనరావు హెచ్చరించారు. గురువారం ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి 90/1లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని పరిశీలించారు. వారివద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. ఇది నిషిద్ధ ప్రదేశం కావడంతో ఇక్కడ ఎవరూ నిర్మాణాలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కూల్చివేతలతో పాటు, కేసులు పెడతామని హెచ్చరించారు. ఈ పర్యవేక్షణలో వీఆర్వో గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.